సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పలువురికి మంజూరైన చెక్కులను అందజేశారు. ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్, టీపీసీసీ లేబర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి శరగడం నర్సింగరావు, డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్‌రెడ్డి, సంతోష్, కాంగ్రెస్ నాయకులు భిక్షపతి, కరణ్, చందు, రహీం, ఖలీం, సురేందర్‌రెడ్డి, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్‌లో నెలలు నిండని పిండం

దర్యాప్తు చేస్తున్న పోలీసులు

జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తులు నెలలు నిండని పిండాన్ని ఓ కవర్‌లో పెట్టి ఓ ఇంటి ముందు పడేశారు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమ్‌సాగర్ వివరాల ప్రకారం.. ఈనెల 21న గాజులరామారం నెహ్రూనగర్‌లోని ఓ ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు పిండాన్ని కవర్‌లో తెచ్చి పారవేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు పిండాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుచిత్ర శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం



కుత్బుల్లాపూర్: అమావాస్యను పురస్కరించుకుని సుచిత్ర శ్రీవాసవీ సేవాదళ్ ఆధ్వర్యంలో శనివారం జీడిమెట్ల గాంధీ విగ్రహం సమీపంలో దుర్గామాత ఆలయంలో అన్నదానం చేపట్టారు. అన్నదానంలో 550 మంది భక్తులు పాల్గొన్నారు. సంఘం సభ్యులు పడకంటి వెంకటేశం, తోట భిక్షపతి, పల్ల నాగరాజు, ఉప్పల నాగరాజు, దొంతుల శ్రీనివాస్, చీకోటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పైకి కెమికల్ ఆయిల్

జారిపడ్డ వాహనదారులు

రంగారెడ్డినగర్: ఓ పరిశ్రమ రోడ్డుపైకి రసాయన ఆయిల్‌ను వదలడంతో వాహనదారులు జారిపడి గాయాల పాలయ్యారు.. గాంధీనగర్ పారిశ్రామికవాడ ప్రాంతంలోని ఎంటీఏఆర్ టెక్నాలజీ పరిశ్రమ యాజమాన్యం శనివారం రాత్రి నిర్లక్ష్యంగా పరిశ్రమ నుంచి వ్యర్థ రసాయన ఆయిల్‌ను రోడ్డుపైకి వదిలింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే క్రమంలో పలువురు వాహనదారులు రోడ్డుపైకి చేరిన ఆయిల్‌ను గమనించక జారి పడ్డారు. పలువురు వాహనదారులు గాయపడగా వారికి స్థానికంగా ఉన్న వారు ప్రాథమిక చికిత్స అందించారు. ఈ క్రమంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడంతో ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లియర్ చేశారు. ఎంటీఏఆర్ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.




విజయనగర్ కాలనీలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని చెబుతున్న ప్రదేశం


భగత్‌సింగ్‌నగర్‌ను ఆనుకుని హెచ్ఎంటీ స్థలంలో డంప్ చేసిన వ్యర్థాలు

దర్జాగా హెచ్ఎంటీ స్థలాల కబ్జా !

- 950 ఎకరాల్లో 50 ఎకరాలు కబ్జా..
- చోద్యం చూస్తున్న అధికారులు


గాంధీనగర్-వెంకట్రామిరెడ్డినగర్ మధ్య చదును చేసిన హెచ్ఎంటీ స్థలం

చింతల్: వందలాది ఎకరాల్లో విస్తరించిన హెచ్ఎంటి పరిశ్రమ గతంలో ఓ వెలుగు వెలిగి నేడు వెలవెల పోతుంది. ఈ పరిశ్రమకు కేటాయించిన 950 ఎకరాల్లో ఇప్పటికే సుమారు 50 ఎకరాల మేర కబ్జాకు గురికాగా మరో 50 ఎకరాలకు పైగా పలు ప్రభుత్వ శాఖలకు కేటాయించారు. ఈ పరిశ్రమకు చెందిన ఖాళీ స్థలాల్లో ఎక్కడపడితే అక్కడ కబ్జాదారులకు కనపడి అందిన చోటల్లా చిన్న చిన్నగ వస్తువులను, వాహనాలను పార్కింగ్ చేస్తూ కబ్జాకు తెరలేపుతున్నారు. దీంతో ప్రతి ఏడాది కొంతమేర హెచ్ఎంటీకి చెందిన స్థలం రోజు రోజుకు కుచించుకు పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ వందలాది ఎకరాల్లో ఆనుకొని ఉన్న ఈ పరిశ్రమ చుట్టూ రెండున్నర దశాబ్దాలలో అనేక బస్తీలు, కాలనీలు వెలిశాయి. ఈ కాలనీలకు అనుగుణంగా హెచ్ఎంటీ చుట్టూ కొంత మేర ఆయా కాలనీలకు చెందిన కొంత మంది అధికారులను మచ్చిక చేసుకొని కొంత భాగం, అధికారులకు తెలియకుండా మరికొంత స్థలాన్ని ఆక్రమించి కబ్జాలకు తెరలేపుతున్నారు.

ముందుగా చదును చేసి..

చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్, రోడా మేస్త్రి నగర్, రంగారెడ్డి నగర్ డివిజన్ విజయనగర్ కాలనీ, వెంకటరామ్ రెడ్డి నగర్, సంజయ్ గాంధీ నగర్, గుబురు గుట్ట తదితర ప్రాంతాల్లో హెచ్ఎంటీ పరిశ్రమకు చెందిన స్థలం నుండి పాములు, క్రిమి కీటకాలు వస్తున్నాయంటూ ఇంటి నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. అనంతరం జేసీబీలతో చదును చేయించి వాహనాల పార్కింగ్ పేరుతో కొంతమంది, పక్కనే ఉన్న ఇంటి వారి సామానును కొద్దికొద్దిగా జమ చేస్తూ ఆక్రమణకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. వెంకటరామిరెడ్డినగర్ గాంధీనగర్ మధ్యలో సుమారు 3000 గజాలకు పైగా రాత్రి వేళల్లో చదును చేశారు. భగత్ సింగ్ నగర్‌లో సుమారు రెండు ప్రాంతాల్లో ఎకరా స్థలంలో ఇంటి నిర్మాణ వ్యర్థాలను పోసి చదును చేశారు. ఇదే భగత్ సింగ్‌నగర్‌కు చెందిన పలువురు కబ్జాదారులు ఏకంగా తమ సొంత స్థలంలో చేసుకున్నట్లుగా భూమి పూజ చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కొంతమేర స్థలం మసీదులు, చర్చిల రూపంలో హెచ్ఎంటి స్థలం ఆక్రమణకు గురైనట్లు చర్చ నడుస్తుంది.

రిజిస్ట్రేషన్ పత్రాలు జారీ అయ్యాయంటూ..

రంగారెడ్డినగర్ డివిజన్ విజయనగర్ కాలనీలోని పోచమ్మ గుడి వెనకాల సుమారు 1500 గజాల స్థలం మేర హెచ్ఎంటీ ఖాళీ స్థలం ప్లాట్లుగా విభజించేందుకు కొంతమంది ప్రయత్నించినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. రిజిష్టర్ కార్యాలయంలో పనిచేసే ఓ వ్యక్తితో మంతనాలు జరిపి సర్వే నెంబర్లు మార్చి ఏకంగా రిజిస్ట్రేషన్ పత్రాలు పొందినట్లు విజయనగర్ కాలనీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. విజయనగర్ కాలనీకి చెందిన కొంతమంది ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైతుంటే హెచ్ఎంటీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ యాజమాన్యానికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం

హెచ్ఎంటీకి చెందిన స్థలం చుట్టూ అనేక కాలనీలు వెలిశాయి. ఎక్కడైతే తమ పరిశ్రమకు చెందిన స్థలాన్ని ఆక్రమించినట్లైతే చర్యలు తీసుకొని తమ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటాం. ఫిర్యాదు అందిన వెంటనే తమ సిబ్బందితో వెళ్లి పలు ప్రాంతాలలో సందర్శించి ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నాం

– రంగనాథ్ చౌదరి, హెచ్ఎంటీ పరిశ్రమ ఎస్టేట్ ఆఫీసర్

మొదటి స్థానంలో నిలిచి..

జాతీయ స్థాయికి అర్హత సాధించి..


సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటూ..



చాంపియన్స్ ట్రోఫీతో ప్రేమ్‌సాగర్

- జాతీయ స్థాయి డ్యూటీమీట్‌కు జీడిమెట్ల సబ్ ఇన్‌స్పెక్టర్
- రాష్ట్రస్థాయిలో గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్‌తో మొదటిస్థానం
- శభాష్ అనిపించుకుంటున్న పోలీస్

జీడిమెట్ల: ఇటీవలే వరంగల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్యూటీమీట్‌లో జీడిమెట్ల సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌సాగర్ ప్రతిభ చూపాడు.ఒక గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్‌తో నెం.1 స్థానంలో నిలిచిన ప్రేమ్‌సాగర్ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతితో శభాష్ అనిపించుకున్నారు. ఇదే సంవత్సరంలో గుజరాత్ జాతీయ స్థాయిలో నిర్వహించే డ్యూటీమీట్‌కు తెలంగాణ తరఫున అర్హత సాధించాడు. దీతో ఆయన శభాష్ పోలీస్ అని పేర్కొంటున్నారు. అంకితభావంతో పని చేస్తే ఫలితాలు అవే వస్తాయని ఆయన అంటున్నారు.

కుటుంబ నేపథ్యం

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి గ్రామానికి చెందిన గంగుబాయి, సాయన్నలు గ్రామంలో వ్యవసాయం చేస్తుంటారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ప్రేమ్‌సాగర్ చిన్ననాటి నుంచి చదువులో చురుకుగా ఉండేవాడు. గ్రామంలో ప్రాథమిక విద్య అనంతరం ఆర్మూర్‌లోని సోషల్ వేల్ఫేర్ పాఠశాలలో ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి ఇంటర్‌లో ఎంసెట్ రాసి కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో సీటు సాధించాడు. ఎలక్ట్రానిక్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. 2013 నుంచి 2016 వరకు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేసి 2016లోనే సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం సాధించి 2019 వరకు సెంట్రల్ గవర్నమెంట్ ఇంటలిజెన్స్ బ్యూరోలో పని చేశారు. అయినప్పటికీ తాను పోలీస్ కావాలన్నది ఆయన కోరిక. తాను అనుకున్నట్లుగానే సబ్ ఇన్‌స్పెక్టర్ అయ్యాడు. 2020 బ్యాచ్‌లో ఎస్ఐగా సెలెక్ట్ అయ్యారు. రాష్ట్ర పోలీస్‌శాఖలో నేరాన్వేషణలో తన వంతు కృషి చేసి మంచి పోలీస్ ఆఫీసర్‌గా పేరు తెచ్చుకోవాలన్నది ఆయన కోరిక.

ఉత్తమ ప్రతిభ కనబరిచి..

వరంగల్‌లో జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్‌లో జరిగిన తెలంగాణ డ్యూటీమీట్‌లో ప్రేమ్‌సాగర్ మూడు విభాగాలు క్రిమినల్‌లాస్, మెడికల్ లీగల్ టెస్ట్, లిఫ్టింగ్ ప్యాకింగ్ పార్వడింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఒకగోల్డ్, రెండు సిల్వర్ పతకాలు సాధించి సైబరాబాద్ నుంచి సాంక్షన్‌షిప్‌ను పొందాడు.

సురవరం మృతి ఉద్యమాలకు తీరనిలోటు


నిజాంపేట్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు


షాపూర్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

జగద్గిరిగుట్ట: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ నాయకులు అన్నారు. శనివారం జగద్గిరిగుట్ట షాపూర్ నగర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఒక గొప్ప మేధావిని అని, పోరాట స్ఫూర్తిని నింపిన గొప్ప నాయకుడిని దేశం కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు ఎండీ యూసుఫ్, జిల్లా కార్యదర్శి ఉమామహేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, దుర్గయ్య, నరసింహారెడ్డి, సహదేవరెడ్డి, శ్రీనివాస్ చారి, వెంకటేష్, బాబు, ఇమామ్, కృష్ణ, నరసింహ, జానకిరామ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్: సురవరం సుధాకర్‌రెడ్డి మృతి కమ్యూనిస్టు పార్టీకి, వామపక్ష ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. శనివారం నిజాంపేట్‌లో సురవరం సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి తరం యువతకు మార్గదర్శకుడని అన్నారు. ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశీ యాదయ్య, టి.దస్తగిరి, శ్రీను, తరుణ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నగర శివారు మున్సిపాలిటీగా ఉన్న కొంపల్లి శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, అందుకు తగ్గట్టుగా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. శనివారం కొంపల్లి మున్సిపల్ జయభేరి పార్క్ కాలనీ ఎన్క్లేవ్‌లో వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధుల వెచ్చించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న కాలనీలు, బస్తీలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జయభేరి పార్క్ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పార్కులను అభివృద్ధి పరిచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అదే విధంగా స్థానికంగా నెలకొన్న వీధి దీపాలు ఏర్పాటు, వీధి కుక్కల బెడద, వరదనీరు చేరకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, డీఈలు తిరుపతి, రాజు, వాటర్ వర్క్స్ డీజీఎం త్రినాధరావు, ఏఈలు ప్రవీణ్, శ్రీనివాస్, మేనేజర్ శ్రీధర్, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, జయభేరి పార్క్ కాలనీవాసులు వాసుదేవ రెడ్డి, కిట్టు, నరసింహారెడ్డి, ఆనంద్, రామభద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం


ఆలయ గేట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శనివారం గాజుల రామారంలోని నల్లగుట్ట లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారాన్ని ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆలయాభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, ఇంద్రసేన గుప్తా, కూన అంతయ్యగౌడ్, శంకర్ రెడ్డి, పెంటా రెడ్డి, బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు రవీందర్ గౌడ్, యాదగిరి శ్రీరాములు, మహేందర్ రెడ్డి, సాగర్, సంజీవరెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఆటో డ్రైవర్ మృతి

జీడిమెట్ల: అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి చెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రేమ్‌సాగర్ వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్టకు చెందిన నగేష్(35) ఆటో డ్రైవర్. 4 సంవత్సరాల క్రితం అతని భార్య ఆత్మహత్య చేసుకుంది. ముగ్గురు పిల్లలను నగేష్ బావ మరుదులు తీసుకెళ్లి పెంచుకుంటున్నారు. నగేష్ అప్పటి నుంచి ఆటో నడుపుతూ తల్లివద్దనే ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఆటో మరమ్మతుల నిమ్మితం నగేష్ తన తల్లి వద్ద రూ.1200 తీసుకుని వెళ్లాడు. శనివారం ఉదయం నాగమ్మకు జీడిమెట్ల పోలీసులు ఫోన్ చేసి నీ కుమారుడు జగద్గిరిగుట్టకు వెళ్లే పైపులైన్ రోడ్డులో ఆటోలో మృతి చెంది ఉన్నాడని సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకుంది. మృతికి గల వివరాలు తెలియరాలేదు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో ప్రసవం చేసిన 108 సిబ్బంది

క్షేమంగా తల్లీబిడ్డలు



జీడిమెట్ల: పురిటినొప్పులు వచ్చిన ఓ మహిళకు 108 సిబ్బంది ఇంటి వద్దనే ప్రసవం చేశారు. పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి నగర్‌కు చెందిన జయకు పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. సమాచారం అందుకున్న జీడిమెట్ల 108 సిబ్బంది నరేష్, కవిరాజ్ జయ ఇంటి చేరుకున్నారు. నొప్పులు ఎక్కువగా ఉండటంతో డాక్టర్ సలహా మేరకు వారు ఇంటి వద్దనే ప్రసవం చేశారు. బిడ్డ మెడ చుట్టూ పేగుతో పుట్టడంతో షాపూర్‌నగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. జయ కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు చేయూతనివ్వాలి



దుండిగల్: స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు ముందుకు రావాలని బీఆర్ఎస్ నాయకుడు శంభీపూర్ కృష్ణ అన్నారు. శనివారం దుండిగల్ తండా-1లోని ప్రభుత్వ పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ సంయుక్త సౌజన్యంతో 100 మంది విద్యార్థులకు మ్యాట్రిసలను అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ సీఎండీ దీపక్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మి, హైదరాబాద్ సైక్లిస్ట్ గ్రూప్ ప్రెసిడెంట్ రవీందర్, సీఎస్ఆర్ ప్రొఫెషనల్ సైక్లిస్ట్ గ్రూప్ భీమ్ సింగ్‌నాయక్, సీఎస్ఆర్ అడ్వైజర్ గడిలా ప్రవీణ్, వార్డు ప్రెసిడెంట్ కొర్ర అమర్ సింగ్ నాయక్, హెడ్ మాస్టర్లు వెంకటేశ్వర్లు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి జేఎన్‌టీయూలో స్పాట్ అడ్మిషన్స్

బాలానగర్: జేఎన్‌టీయూ పరిధిలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో భర్తీ కాకుండా మిగిలిన ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం బీటెక్ సీట్లకు ఈ నెల 26 నుంచి స్పాట్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు అడ్మిషన్ విభాగం డైరెక్టర్ బాలు నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో ఈ 29వ తేదీ వరకు అడ్మిషన్స్ పొందవచ్చన్నారు. 978 సీట్లను స్పాట్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయనున్నారు. ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణులు కాలేకపోయిన విద్యార్థులు సైతం హాజరు కావచ్చని తెలిపారు.

అమావాస్య పూజలు.. అన్నదానాలు


మగ్దూం నగర్‌లోని బొడ్రాయికి పూజలు


భూదేవి హిల్స్‌లోని బొడ్రాయి వద్ద..

జగద్గిరిగుట్ట: అమావాస్యను పురస్కరించుకొని శనివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కాళికాదేవి ఆలయంలో అమ్మవారికి, అంజయ్య నగర్‌లో నల్లపోచమ్మకు, జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో దుర్గమ్మ తల్లికి, మగ్దూం నగర్‌లోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీ వాసవి సేవా సమితి, సప్తగిరి వైశ్య ఫ్రెండ్స్ గ్రూప్, సుచిత్ర వాసవి సేవా సమితి, ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అమావాస్యను పురస్కరించుకొని మగ్దూం నగర్, భూదేవి హిల్స్, మైసమ్మ నగర్‌లలో ఉన్న బొడ్రాయిల వద్ద అభిషేకం నిర్వహించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న హన్మంత్‌రెడ్డి

దుండిగల్: ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ మల్లంపేట్‌లోని ఆకాశ్ లేఔట్‌లో శనివారం దెబ్బతిన్న సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని, రోడ్డును పట్టించుకోకపోవడంతో తాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధులు మంజూరు చేయించానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు శామీర్‌పేట్ ప్రకాష్ రావు, రేవంత్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, హరివర్ధన్, కాలనీవాసులు అజిత్ రామారావు, రామకృష్ణ, సత్య వంశీకృష్ణ, సుబ్బారెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు